

సీపీకి ఉత్తమ సేవా పతకం

మంచిర్యాలక్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాకు పోలీసుశాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు.



2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీపీ వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలం వృత్తి పరమైన నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకుగాను ఈ పతకానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ సీఎంను కలిసిన పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్

మందమర్రి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం నారాచంద్రబాబు నాయుడును పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం రాష్ట్రంలో టీడీపీ పనితీరుపై ఆయనతో చర్చించారు.

ప్రధాని ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత ఆదాయం రెట్టింపు చేస్తామని, అవినీతి అంతం బీజేపీ పంతం, బేటి బచావో బేటి పడావో, బ్లాక్ మనీని బయటకు తెచ్చి పేదల జన్‌దన్ ఖాతాల్లో రూ. 15 లక్షల జమ చేస్తానని చెప్పి ఇప్పటి వరకు చేయలేదన్నారు. వెంటనే ప్రజలకు ఇచ్చిన హామలను నెరవేర్చాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు. నాయకులు మల్లన్న, చిరంజీవి, ఉదయగిరి, రాజన్న, వెంకన్న, లక్ష్మీ, జ్యోతి, అరుణ, శ్రీకాంత్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.



ఈ సారైనా అనుకూలించేనా..?

- గూడెం గ్రామానికి రిజర్వేషన్ పంచాయతీ
- గిరిజనులు లేకున్నా నోటిఫైడ్ ఏరియాగా నమోదు
- పోటీ చేసే వారు లేక ప్రత్యేక అధికారుల పాలన
- దశాబ్దాలుగా పదవులకు నోచుకోని గ్రామస్థులు

మంచిర్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు సంబంధించి త్వరలో రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గ్రామ పంచాయతీలకు సెప్టెంబరు 30 లోపు ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చింది. అలాగే జూలై నెలాఖరులోపు రిజర్వేషన్ ప్రక్రియ ముగించాలని కూడా తీర్పులో పేర్కొంది. ఈ క్రమంలో మొదట రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దండేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతీకి ఈ సారైనా రిజర్వేషన్లు అనుకూలిస్తాయేమోనన్న గంపెడాశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు. గూడెం గ్రామ పంచాయతీలో మూడు దశాబ్దాలకు పైగా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగడం లేదు. గ్రామంలో ఒక్క గిరిజనుడు లేకపోయినా గ్రామసర్పంచ్‌తోపాటు పలు వార్డు సభ్యుల పదవులను మాత్రం షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కులస్థులకు రిజర్వ్ చేశారు. దీంతో 35 ఏళ్లుగా ఎన్నికలు జరుగక పోవడంతో పంచాయతీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతోంది.

నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించడంతో...

గూడెం గ్రామ పంచాయతీలో 1800పై చిలుకు మంది ఓటర్లు ఉన్నారు. గూడెంలో ఒక్కరు కూడా గిరిజనులు లేకపోయినా 1950లో అప్పటి ప్రభుత్వం గ్రామాన్ని నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించింది. రిజర్వేషన్ ప్రకారం గిరిజనులు ఎవరూ లేకపోవడంతో పోటీ చేసే వారు లేక అప్పటి నుంచి అ గ్రామంలో ఇన్‌చార్జిల ద్వారా పాలనను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా, 1987 నుంచి గ్రామ సర్పంచు స్థానాన్ని సైతం ఎస్టీకి రిజర్వు చేశారు. సర్పంచు పదవితో పాటు గ్రామంలోని 10 వార్డు సభ్యుల స్థానాల్లో ఐదింటిని గిరిజనులకు కేటాయించారు. అప్పటి నుంచి సుమారు 35 ఏళ్లుగా గూడెం గ్రామ పంచాయతీకి సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసేందుకు అర్హులు లభించడం లేదు. దీంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. ప్రజలకు కనీస సౌకర్యాలు..

(తరువాయి 7లో)



అయేషా మస్రత్‌ఖానంకు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలి

రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్‌ఖానం

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్‌ఖానం పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రరెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్, టీజీఎంఐడీసీ ఈఈ నరసింహారావుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే విద్యా బోధన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద పద్ధతిన ఇతర పోస్టుల్లో సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ పరిధిలో ఉన్న పోస్టులను అవసరం మేరకు భర్తీ చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న మాతా శిశు ఆసుపత్రి, కాలేజీ రోడ్డులోని ప్రభుత్వ వైద్యకళాశాలలను సందర్శించి వార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

హాజీపూర్: గుడిపేటలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీని శనివారం వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ అయేషా మస్రత్‌ఖానం సందర్శించారు. పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌ను, అధికారులను వాకబు చేశారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విభాగం నందు పని చేస్తున్న పేసెంట్ కేర్, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డు, ఎలక్ట్రీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులు, ఇతర వర్కర్లందరికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని వైద్యా ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

నస్పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 9న నిర్వహించే దేశ వ్యాప్తం సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు నాయకులు కోరారు. నస్పూర్ పట్టణంలోని రైస్ మిల్లుల వద్ద శనివారం హమాలి కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్లను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ మాట్లాడుతూ హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలి సంఘం నాయకులు సురేందర్, మొగిలి, రౌతు శంకర్, నగేష్, పోశం, నాగన్న, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మిడివెల్లి రాజ్ కుమార్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నాయకులవి అవగాహన లేని మాటలు'

చెన్నూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాజా రమేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని చెన్నూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మళ్లీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అవగాహన లేకుండా ప్రారంభించారా అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్లు, పలు పనులు 70శాతం పూర్తయ్యాయన్నారు. చెన్నూరులో బస్సు డిపో కోసం ఇచ్చిన స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు అప్పటి ఎమ్మెల్యే అండదండలతో కబ్జా చేశారన్న విషయమైనా గుర్తుందా లేదా అని విమర్శించారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు, శ్రీధర్, నారాయణ, అన్వర్, సుశీల్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతే రాజు

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

ఎడ్ల బండ్ల ర్యాలీతో రైతు భరోసా సంబరాలు



దండేపల్లిలో ఎడ్ల బండ్ల ర్యాలీలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

దండేపల్లి జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతే రాజు అని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. దండేపల్లిలో శనివారం రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. దండేపల్లి బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున ఎడ్ల బండ్లతో ఎమెల్యే భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా నిధులు కేవలం 9రోజుల్లో 9వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. కేవలం తెలంగాణలో మాత్రమే పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నియోజక వర్గంలో దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలు పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం కాబట్టి రెండు పంటలు సాగువుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు, నాయకుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

విద్యాలయాలను సందర్శించిన ఎమ్మెల్యే

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు చక్కటి విద్య బోధన అందించాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని చేపట్టే అభివృద్ధి పనులను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం దండేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కస్తూర్బాలో కోతుల బెడద ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకరాగా ప్రహరీ చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ వేయి స్తానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో ప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి బోనాల జాతర

హాజీపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట, ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గల పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ముదిరాజులు పెద్దమ్మతల్లి బోనాల జాతరను నిర్వహిస్తున్నారు. గురువారం పోచమ్మ బోనాలతో ప్రారంభమైన ఈ జాతర శుక్రవారం పెద్దమ్మతల్లి జోగు, శనివారం పెద్దమ్మతల్లి బోనాలను ఊరేగింపుగా ప్రాజెక్టు వద్ద గల పెద్దమ్మతల్లి ఆలయంలోనికి ప్రవేశించారు. ఆదివారం ఉత్సవాల చివరి రోజులో భాగంగా పట్నాలు వేయడం, గావుపిల్ల పట్టడంతో ఈ జాతర ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



బోనాల ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు

రగులుతున్న పోడు వివాదం

- పోడు వ్యవసాయం కోసం రిజర్వ్ ఫారెస్ట్‌లో గిరిజన మహిళలు
- అవగాహన కల్పించినా ఆగని లొల్లి



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

దండేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పోడు వ్యవసాయం కోసం ఆదివాసీ గిరిజనుల పోరాటం ఆగడం లేదు. మండంలోని కొత్త మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దమ్మనపేట, మామిడిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు లింగాపూర్ అటవీ బీట్‌లోని 380 కంపార్ట్‌మెంట్‌లో శనివారం పలు చోట్ల పోడు వ్యవసాయ భూముల కోసం వచ్చిన గిరిజనులను అటవీ పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న జన్నారం అటవీ డిజనల్ అధికారి ఎఫ్‌డీవో రామ్మోహన్, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, తాళ్లపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావు, లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి, దండేపల్లి, జన్నారం ఎస్సైలు తహసీనొద్దీన్, అనూష, అటవీ శాఖ సిబ్బంది, బేస్ క్యాంపుతో అక్కడికి చేరుకున్నారు. అనంతరం అటవీ గ్రామ సమీపంలో ఉండే గిరిజనులు అటవీ చట్టాలపై పోలీసులు అవగాహన కల్పిం చారు. అటవీ భూముల్లో చెట్లను తొలగిం చడం, నరికి వేడయం చట్ట విరుద్ధమని గిరి జనులకు సూచించారు. గిరిజనులకు ఎంత చెప్పిన వినకుండా వారి పని వారు చేసు కోవడంతో ఎమి చేయలేక అధికారులు అక్కడే వేచి చూసారు.

ఎఫ్‌డీవో కాళ్ల మీద పడిన గిరిజనులు

అడవి ప్రాంతాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు కనీసం బతుకు దెరువు కోసం పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తామంటే అటవీ శాఖ అధికారులు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నామన్నారు. ఈ భూమిపై తమకే హక్కు పత్రాలు అందజేయాలన్నారు. న్యాయం చేయాలంటూ శనివారం ఇక్కడికి వచ్చిన అధికారుల కాళ్లమీద పడి వేడుకున్నారు. అధికారులు వారికి నచ్చజెప్పినా వినకుండా గిరి జనులు వెళ్లిపోయారు. దీంతో ఉదయం నుంచి అక్కడ అధికారులు, గిరిజనుల మధ్య పోడు వివాదం కొనసాగుతూనే ఉంది. రిజర్వ్ ఫారెస్ట్‌లో చెట్లను నరికి వేడయం, తొలగించం చట్ట విరుద్ధమని, అటవీ వన్య ప్రాణి చట్టాలను ఎవరు అతిక్రమిస్తే నేరమని జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ సూచించారు. పోడు భూముల సమస్యలు తమ దృష్టికి తీసుకవస్తే జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కార్యదర్శులకు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై శిక్షణ

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిపాలన సం స్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, పెన్షన్‌ల మంత్రిత్వ శాఖ మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సమాచార హక్కు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై మంచిర్యాల శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఆయన మాట్లా డుతూ మెరుగైన స్థానిక పాలన, సమాచార హక్కు చట్టం, గ్రామసభ బలోపేతం, మహిళ సాధికారత, బాలల సంరక్షణకు సంబంధిత ముఖ్య మైన చట్టాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రీసోర్స్ పర్సన్‌లు అజ్మత్ అలీ, శ్రీనివాస్, సతీష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో పారదర్శకంగా ఉండాలి

రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



రివార్డు అందజేస్తున్న పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, జూన్28 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రత, నేరాల నియంత్రణలో, కేసుల పరిశోధనలో పోలీసు అధికారులు పారదర్శకంగా ఉండాలని రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. నెలవారి సమీక్షలో భాగంగా వారు మంచిర్యాల, రామగుండం, పరిధిలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుల అరెస్టు, దర్యాప్తు సాక్షాధారాల సేకరణ, చార్జిషీట్లకు సంబంధించిన ప్రస్తుత కేసుల స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నమోదైన కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తినేరాలు, ఫోక్సోకేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలతో పాటు కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఎలాంటి చర్యలు తీసుకున్నారు. అనే విషయాలపై సమీక్షిం చారు. బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియాలో ఏటీఎం దొంగతనానికి యత్నం చేసిన దొంగలను చాకచక్యంగా పట్టుకున్న నెన్నెల ఎస్ఐ ప్రసాద్, బ్లూకోట్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ సాయి, హోంగార్డు సంపత్‌లు క్యాష్ రివార్డు అందించి అభినందించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ రాజు, ఏసీపీలు, ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

బీసీ డిగ్రీ కళాశాలను .. మంచిర్యాలలో ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నస్పూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జ్యోతి రావు పూలే బీసీ రెసిడెన్షియల్ కళాశాలను మంచిర్యాలలో కొనసాగించాలని బీజేపీ నాయకులు శనివారం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతూ 2023-24విద్యా సంవత్సరంలో మంచిర్యాల జిల్లాకు కేటాయించిన జ్యోతిరావు పూలే డిగ్రీ కళాశాలను నిర్మల్ జిల్లాలో రెండేళ్ల నుంచి నిర్వహిస్తున్నారన్నారు. దీనిని మంచిర్యాల జిల్లాలోనే కొనసాగించాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి గాను అన్ని జిల్లాలో బీసీ రెసిడెన్షియల్ కాలేజ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ మంచిర్యాలలో ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ గర్మిళ్ల జోన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మెరడికొండ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి, నాయకులు చక్రవర్తి, కుమారస్వామి, అశోక్, రాంచందర్, చిరంజీవి, వెంకటేష్, సదయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

గురుకులం ప్రిన్సిపల్ రమాకళ్యాణి



ప్లకార్డులతో విద్యార్థులు

లక్షెట్టిపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణం కాపాడాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతీ ఒక్కరు నిషేందించాలని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం ప్రిన్సిపల్ రమకళ్యాణి అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం ప్లాస్టిక్ ఫ్రీస్కూల్ కార్యక్ర మం నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు, అనార్థాలు విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతో పాటు వాటికి ప్రత్యామ్నాయంగా ఏలాంటివి ఉపయోగించాలనే అంశాలను వివరించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ప్లకార్డు పట్టుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించనున్నట్లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ గీతాంజలి, జూనియర్ ప్రిన్సిపల్ శిరీష పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తే కేసులా?

హైకోర్టులో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే పిటిషన్

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసినందుకు తిరిగి తమపైనే అక్రమంగా కేసు బనాయించారని ఆరోపిస్తూ మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్, మరో 29 మంది బీఆర్ఎస్ నాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అక్రమ కేసులో అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరారు. ఆ కేసును కొట్టివేయాలని విన్నవించారు. అనుమతి లేకుండా మంచిర్యాలలోని బెల్లంపల్లి చౌరస్తాలో జాతీయ రహదారిపై ధర్నా చేశారని పేర్కొంటూ దివాకర్‌రావు తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టప్రకారం దర్యాప్తు చేపట్టాలని మంచిర్యాల పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా పడింది.

యువత వ్యసనాల బారిన పడొద్దు

తిర్యాణి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దని ఎస్సై అన్నారు. తిర్యాణి పోలీసు చేతికి డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్టును శనివారం పోలీసు ఉన్నతాధికారులు అందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో డ్రగ్స్ వినియోగంపై ఉక్కు పాదం మోపనున్నట్లు చెప్పారు. డ్రగ్స్ డిటెక్షన్ టెస్ట్ కిట్టు ద్వారా సదరు వ్యక్తి ఏ డ్రగ్స్ తీసుకున్నాడో తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. కొకైన్, గంజాయి, మోర్ఫిస్, హెరాయిన్, తదితర నిషేధిత డ్రగ్స్ పదార్థాలు ఇతర డ్రగ్స్‌లు ఏవీ తీసుకున్నా ఆ వ్యక్తి మూత్రాన్ని ఈ కిట్టు ద్వారా పరీక్షించనున్నామని అన్నారు. నిర్ధారణ అయిన తరువాత సదరు వ్యక్తిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

తిర్యాణి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చింతలపల్లి గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లే కార్యక్రమంలో భాగంగా పీఎంజుగా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అమల్లోకి తీసుకు వచ్చిందని తెలిపారు. దీని ద్వారా గిరిజనులు అందని వివిధ సేవలను వారున్న గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రభుత్వమే అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేష్, డీటీ వంశీకృష్ణ, పీఎం జుగా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్ఆర్పీ యశ్వంతరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు భూమి పూజ

జైనూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జామ్నిలో శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులకు మాజీ సర్పంచ్ మేస్రాం రాహుల్, ఉప సర్పంచ్ డోంగ్రే సమాధాన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా ప్రాంగణాలు.. నిరుపయోగం

- ఆట వస్తువులు లేక ఆసక్తి చూపని క్రీడాకారులు
- పట్టించుకోని అధికారులు



చింతగూడలో అలంకారప్రాయంగా మారిన క్రీడా ప్రాంగణం

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువకులు, విద్యార్థులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భా టంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఒక్కో మైదానానికి లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు ఖర్చు చేశారు.

గత బీఆర్ఎస్ పాలనలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ఆయా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు. క్రీడలకు అనుకూలంగా లేని చోట్లనే చాలా వరకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో, పట్టణాల్లోనూ ఆయా ప్రాంగణాల్లో క్రీడలు జరగకపోవడం లేకపోగా కేవలం మైదానాల్లో గడ్డి మొలు స్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ గ్రామ పంచాయతీకి, పట్టణ ప్రాంతాల్లో ప్రతీ వార్డుకు ఒకటి చొప్పున అధికారులు వీటిని ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

నిర్వహణ లోపం..

క్రీడా ప్రాంగణాల నిర్వహణను పట్టించుకోక పోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం పట్టించుకోక పోవడం, అధికారులు గాలికి వదిలేయడంతో అనేక చోట్ల కేవలం నామమాత్రంగా తయారయ్యాయి. పలు చోట్ల పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు నిర్మించారు. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించినప్పటికీ కొన్ని చోట్ల అవి కేవలం పశువులకు ఆవాసాలుగా మారిపోయాయి. మరి కొన్నిచోట్ల వర్షాలకు బురదమయంగా మారాయి. కాగజ్ నగర్ మండలంలోని గ్రామ పంచాయతీలతో పాటు పట్టణంలోని ఆయా వార్డుల్లో క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతి వనాలు చెత్తాచెదారం పెరిగిపోయి కళ విహీనంగా మారాయి. కొన్ని చోట్ల ఊరికి దూరంగా ఉండడంతో వాటిని ఉపయోగించుకోలేదని పరిస్థితి నెలకొంది.

ఇలా చేస్తే ఉపయోగం..

క్రీడా ప్రాంగణాల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలి. క్రీడలకు అవసరమైన పరికరాలు, వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. క్రీడా ప్రాంగ ణాలను స్థానికుల అవసరాలకు అనుగుణంగా ఉపయో గించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి. కొన్ని చోట్ల క్రీడా ప్రంగాణాలు ఏర్పాటు చేసిన భూములు వివాదాస్పదంగా మారినందున అధికారులు పరిష్కరిస్తే క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

ట్రాక్టర్ అదుపు తప్పి యువకుడి మృతి


విఘ్నేష్(ఫైల్)

తాండూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామానికి చెందిన మల్లెత్తుల విఘ్నేష్ (21) అనే యువకుడు ట్రాక్టర్ అదుపు తప్పడంతో తీవ్రగాయాలై మృతిచెందినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం విఘ్నేష్ తన ట్రాక్టర్ తీసుకుని టేకులపల్లి నుంచి ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ వరకు రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఒర్రెలోకి వెళ్లడంతో తలకు బలమైన గా యాలై విఘ్నేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు..


అంబాలి(ఫైల్)

కాసిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని లంబడి తండా గ్రామానికి చెందిన వృద్ధురాలు భుక్యా అంబాలి(70) శనివారం రాత్రి ప్రమాదవశాత్తు ఇంటి సమీపంలోని బావిలో పడి మృతి చెందినట్లు దేవాపూర్ హెడ్‌కానిస్టేబుల్ గుణవంతరావు తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాలి కొంతకాలంగా అనారోగ్యం(ఫిడ్స్)తో బాధపడుతోంది. శుక్రవారం సాయంత్రం ఇంటిలో ఎవరు లేకపోవడంతో నీళ్లకోసం బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిందన్నారు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా అర్ధరా త్రి బావిలో శవమై కనిపించిందన్నారు. మృతురాలు కొడుకు రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసితుల హియరింగ్

జైపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల మీదుగా వెళ్తున్న వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందించాల్సిన నష్టపరిహారంపై భూనిర్వాసితులు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన హియరింగ్‌లో పాల్గొన్నారు. భూములు కోల్పోయిన రైతులు మాట్లాడుతూ 2022-23లో తమ భూములు గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్టు కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అప్పట్లో ఆర్బిటేషన్ ద్వారా నిర్ణయించిన నష్టపరిహారం ప్రకారం మొదటి నోటిఫికేషన్‌కు సంబంధించిన భూ నిర్వాసితులకు ఎకరానికి రూ. 20.60 లక్షలు, రెండవ నోటిఫికేషన్ ఉన్న వారికి రూ. 20.80 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం తమకు రూ.19.30 లక్షలే చెల్లించిందన్నారు. మిగిలిన నష్టపరిహారం వెంటనే వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం నాయకులు మల్లేష్, రామారావు, రాంరెడ్డి, బోయిని సంపత్, నర్సింగరావు, రాజేశ్వర్‌రావు, రాజయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జైనూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వాహ నదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎస్సై రవికుమార్ అధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మె ట్లు, లైసెన్సులు, ధ్రువపత్రాలు పరిశీలించారు. ఎస్సై మాట్లాడు తూ వాహనదారులు లైసెన్సు తప్పకుండా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. . కార్యక్రమంలో ఏఎస్సైలు ముండె ఉద్ధవ్, బాబర్ బేగ్ రెండో ఎస్సై చవ్హాన్ ఉల్లాస్ పాల్గొన్నారు.

గిరిజన ఆవాసాల అభివృద్ధి

జైనూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేస్తున్న పీఎం జుగా పథకంతో గిరిజన ఆవాసాలు అభివృద్ధి చెందుతాయని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. మండలంలోని భుసిమెట్ట గ్రామంలో గిరిజనులకు పీఎం జుగా పథకంపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పీఎం జుగా పథకం జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీఆర్పీలు మారుమూల గ్రామాల్లో ప్రతి రోజు పర్యటించి పీఎం జుగా పథకం తీరు తెన్నులు, వాటితో గల లాభాలను వివరిస్తున్నారని తెలిపారు. పీఎం జుగా పథకం జిల్లాలోని 102 గ్రామాల్లో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీలు ఉయిక శంకర్, చవ్హాన్ రవిందర్ పాల్గొన్నారు.

కన్నవారికి శోకం మిగుల్చవద్దు


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెంచికలపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యువత క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుని కన్న వారికి శోకం మిగుల్చవద్దని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మండలంలోని ఆగర్‌గూడ గ్రామానికి చెందిన తుమ్మిడి రాజశేఖర్ నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడంతో శనివారం అతడి తల్లి లక్ష్మిని పరామర్శించారు. తన వంతుగా బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఆత్మహత్యలకు పాల్ప డవద్దని, బంగారు భవిష్యత్‌ను నాశ నం చేసుకుని తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగల్చడం సరికాదన్నా రు. అలాగే పారాక్విట్ అనే గడ్డి మందు విరివిగా దుకాణాల్లో దొరుకు తుందని చెప్పారు. ఆ గడ్డి మందు తాగితే నూటికి నూరు శాతం మంది చనిపోతున్నారనే విషయాన్ని అసెంబ్లీలో తాను ప్రస్తావిం చానని గురుత చేశారు. అనంతరం గెండపల్లి గ్రామానికి చెందిన సిడాం రాధ, ఎల్లూరుకు చెందిన మాజీ సర్పంచ్ గణపురం కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు రాజేశ్వర్, నగేష్, నాన్నయ్య, పురుషోత్తం, వెంకన్న, సంతోష్, అనంతరావు, కాంతారావు, భీమయ్య, కిషన్ ఉన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

చెత్తను తొలగించిన సిబ్బంది

చెన్నూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీసాయి ఆలయ సమీపం పక్కన పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది శనివారం తొలగించారు. అపరిశుభ్రం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో శనివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆలయం పక్కన రెండు రోజుల క్రితం వేసిన చెత్తను, చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించారు. కాలనీవాసులు, భక్తులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కెరమెరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బంగారం వ్యాపారులు దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై మధుకర్ అన్నారు. పోలీసు స్టేషన్‌లో వ్యాపారులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. ఈ మేరకు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం జుగా'పై అవగాహన

కౌటాల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీర్దండి గ్రామంలో పీఎంజుగా(జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్)పై ఎస్ఆర్పీ పోచాని అవగాహన కల్పించారు. మండలంలో మర్తిడి గ్రామ పంచాయతీ పీఎంజుగా పథకం కింద ఎంపికైందని, ఈ పథకం కింద పక్కా గృహాలు, విద్యుత్, రహదారుల నిర్మాణం చేపడుతామని తెలపావు. కార్యక్రమంలో ఏపీఎం ముక్తేశ్వర్, ఇన్‌చార్జి కార్యదర్శి ప్రదీప్, సీసీ కల్పన తదితరలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలి


మంత్రి వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిం చాలని కోరుతూ శనివారం కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి వివేక్‌కు పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి 38 ఏళ్లు పూర్తి చేసుకున్నా పట్టణంలో సీసీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ నిర్మాణం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక శ్రీవాస్, ప్రవీణ్, కొలిపాక కిరణ్ పాల్గొన్నారు.

భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

బెల్లంపలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూభారతి చట్టంకు రైతులకు ప్రజ లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలను నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజా పాలన సాగిస్తుందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభు త్వం పట్టించుకోకపోవడంతో ప్రజలపై ఆర్థికభారం పడుతుందన్నారు. ప్రస్తుత వర్షాకాలం మొదలైన ప్పటికీ గ్రామాల్లో హెల్త్‌క్యాంప్‌లు లేవని అలాగే ఎన్నో గ్రామాలకు బస్సు సౌకర్యం కూడ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి కారణమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదవవాడకు రహదారి నిర్మించాలి


నిరసన తెలియజేస్తున్న యాదవవాడ ప్రజలు

జైపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం గ్రామంలోని దొర గారిపల్లెకు సమీపంలో ఉన్న యాదవుల వాడకు రహదారి నిర్మించాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రేగుంట రాకేష్ డిమాండ్ చేశారు. శుక్రవా రం యాదవ వాడలోని ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పాత ఖార్ఖానా కుంట వెనక భాగాన ఉన్న యాదవవాడ మెయిన్ రోడ్డు పక్కనే ఉన్నా సరైన మార్గం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రోడ్డును నిర్మించాలని కోరారు.



సామాజిక సేవలో ముందుండాలి

శ్రీరాంపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు బొగ్గు ఉత్పత్తితో పాటు సామాజిక సేవలో ముందుండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న 20 మంది ఉద్యోగులు శనివారం రక్తదానం చేశారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో నిర్వహించిన శిబిరానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని దానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదన్నారు. ఉద్యోగుల నుంచి సేకరించిన రక్తాన్ని తలసేమియా, కిడ్నీ, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు గర్భిణులకు, పరభుత్వ ఆస్పత్రిలో శిక్షణ పొందుతున్న నిరుపేదలకు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్‌గా పనిచేసి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న కల్లూరి వెంకట రామారావును సన్మానించారు. వెంకట రామారావు శ్రీరాంపూర్ ఏరియాలో 51 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సుమారు 1350 మంది ఉద్యోగులతో రక్తదానం చేయించి చాలా మంది పేదలను కాపాడారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ కల్లూరి వెంకట రామారావు, డిప్యూటీ సీఎంఓ డాక్టర్ పి. రమేష్‌బాబు, వీటీసీ జేఎంఓ రాజ్‌కుమార్, పిట్ కార్యదర్శి విజయలక్ష్మీ, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, శంకర్ వర్మ, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్ల సాధనే ధ్యేయం

మందమర్రి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కార్మికుల డిమాండ్ల సాధనే ధ్యేయంగా ఏఐటీయూసీ పని చేస్తుందని బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. ఏరియాలోని కేకే ఓసీలో శనివారం నిర్వహించిన నిరసన కార్యమంలో ఆయన మాట్లా డారు. ఇంటి అద్దె లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం అర్థంచేసుకోకపో వడం దారుణమన్నారు. త్వరలో చెల్లింపునకు చర్యలు చేపట్టకపోతే దశలవారీ ఆందోళన లు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, సీవీ రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని శనివారం జీఎం కార్యాలయం ఎదుట ఐఎన్టీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. అంతకు ముందు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య మాట్లాడారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో పని చేస్తున్న ఉద్యోగుల ఇంటి అద్దెల చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా కార్మికులకు ప్లేడేలు వర్తింపజేయాలని, కేకే ఓసీలో ఉద్యోగులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణిలో పని చేసిన రిటైర్డు కార్మికులకు కంపెనీ ఆసుపత్రిలో బీపీ, షుగర్ మందులు అందబాటులోకి ఉండేలా చూడలన్నారు. మందమర్రిలో ఖాళీగా ఉన్న ఎస్అండ్‌పీసీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలో దశాబ్దాల క్రితం నిర్మించిన క్వార్టర్లకు మరమ్మతులు చేసిన తర్వాతనే ఉద్యోగులకు కేటయించాలన్నారు ఉద యం ఐదు గంటలకు ప్రీషిఫ్టులో విధులు నిర్వహించే కార్మికులకు అల్పాహారం సదుపాయం కల్పించాలి కోరారు. వారికి రక్షణగా మైనింగ్ సర్దార్ ను కేటాయించాలన్నారు. సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల కోసం పోరాటం చేసే ఏకైక యూనియన్ ఐఎన్టీయూసీ అని తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జీఎం దేవేందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంశెట్టి నరేందర్, నాయకులు మిట్ట సూర్యానారాయణ, రామకృష్ణ, ప్రసాద్, అన్ని గనుల పిట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై పోరాటం

మందమర్రి టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తామని బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్ అన్నారు. ఏరియాలోని స్టోర్స్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కార్మిక చట్టాలను కోడ్‌లు విభజించడం సరికాదన్నారు. అదే విధంగా విజిలెన్స్ పేరుతో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామక ఉద్యోగాలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల సంపత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. సీసీసీలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి అమలు చేయాలని చూస్తున్నారన్నారు. ఇది ఏమాత్రం సరికాదన్నారు. అలాగే బొగ్గు సంస్థల్లో పని గంటలు పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరించే కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని, ఆదాయపు పన్ను రద్దు చేయాలని, విజిలెన్స్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించే సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సమ్మె చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కేంద్ర నాయకులు గోళ్ల సత్యనారాయణ, మీన కొముర‌య్య, ఏరి యా నాయకులు దుర్గం లక్ష్మణ్, సాయికృష్ణ, శ్రీనివాస్, వేణు, ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్ టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జన్నారం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ గ్రామ శివారులో కొంత మంది డబ్బులు పెట్టి పేకాట ఆడుతు న్నారన్న పక్కా సమాచారం మేరకు ఎస్ఐ అనూష సిబ్బందితో దాడి చేసి దండేపల్లి మండలానికి చెందిన ఒకరు, రాజంపేట గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.10,600 నగదు స్వాధీన పరుచుకున్నారు. విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ అనూషను అడ్డుకొని బెదిరించినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ సూపరింటెండెంట్ రాష్ట్ర సంచాలకులు శివకృష్ణ అన్నారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఏపీడీ రామకృష్ణ, ఇన్‌చార్జి డీవో ఉదయబాబు, రీజనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అశోక్‌కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి సర్వేలో జిల్లాలో అడ్మిషన్లు తక్కువగా ఉన్నట్లు తెలిందన్నారు. అనివార్య కారణాల వల్ల విద్యను మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జూలై 11వ తేదీ లోగా అడ్మిషన్లు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, మధుకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్‌పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

వయోజన అక్షరాస్యులకు పరీక్షలు



రైతు వేదికలో ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

కాసిపేట, జూన్28 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా మండలంలోని వయోజనులకు అక్షరాలు దిద్దించి పాఠాలు బోధించారు. శనివారం మండలంలోని ముత్యంపల్లి, ధర్మరావుపేట రైతు వేదికలతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో ఆవరణలో అక్షరాలు నేర్చుకున్న వయోజనులకు ముల్యాంకన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్యా జిల్లా అధికారి ఆజ్మీర పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ మండలంలో 3462 మంది నిరక్ష రాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దామన్నారు. వారందరికీ ప్రాథమిక చదువులో సామర్థ్యాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాతరాజు దుర్గాప్రసాద్, తహసీల్దార్ భోజన్న, ఆత్మచైర్మన్ రౌతు సత్తయ్య, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, లీడ్ బ్యాంక్ ఆఫీసర్ తిరుపతి, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిని కొనసాగించాలి

చెన్నూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గెర్రె ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగానే కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు డి మాండ్ చేశారు. శనివారం నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని వారు సందర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజార మేష్ మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాడన్నారు. దానిని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 70 పడకల ఆసుపత్రిగా కుదించేందుకు ప్రణాళికలు తయారు చేస్తోందని, అది విరమించుకోవాలన్నారు. పట్టణంలో కొనసాగుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాతా శిశు సంక్షేమ ఆసుపత్రిగానే కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజుద్దీన్, మాజీ కౌన్సిలర్లు మహేష్, శ్రీను, మాజీ సర్పంచు కృష్ణ పాల్గొన్నారు.

నర్సాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

తాండూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ వద్ద ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్‌లో పర్యటించి ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాగు వద్ద ఉన్న తాత్కాలిక రోడ్ డ్యాంను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వర్షాలు పడి వాగు ఉప్పొంగితే అనారోగ్యం బారిన పడిన గ్రా పటేల్‌కు వైద్యం అందక మరణించాడన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపించడంతో వాగుతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. వెంటనే నర్సాపూర్‌లో ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని, వాగుపై బ్రిడ్జిని నిర్మించాలన్నారు. నాయకులు బాదిరావు, సోయం ప్రభాకర్, దిందర్‌షా, జంగు, శ్యాంరావు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడంలో ముందుండాలి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కార్పొరేటుకు దీటుగా రాష్ట్రంలో ఉచిత విద్యం, వైద్యం అందించడంలో మంచిర్యాల నియోజకవర్గం ప్రథమస్థానంలో ఉండటమే తన లక్ష్యం అని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని వచ్చే నెల 3న ప్రారంభించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. జూలై 10లేదా 12వ తారీకున ఆసుపత్రి భవనం అధికారికంగా ప్రారంబిస్తామని, మంత్రులు, అధికారులు, ముఖ్య నాయకులు బారీ సంఖ్యలో చుట్టు పక్కల జనం కూడా వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మన ప్రాంతంలో ప్రజలకు పూర్తిస్థాయిలో విద్య వైద్యం అందేందుకు తన టీం పని చేస్తుందని తెలిపారు. 2028సంవత్సరం నాటికి నియోజకవర్గంలో అసలు ప్రవేట్ ఆసుపత్రులు కానీ విద్యా సంస్థలు కానీ ఏవీ ఉండవన్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో మొట్టమొదటి ప్రభుత్వ పాఠశాల, కళాశాల భవనం కూడా మన లక్షెట్టిపేట పట్టణంలో మాత్రమే ఉందని అదే విధంగా ఆసుపత్రి కూడా మన లక్షెట్టి పేటలో ఆతర్వాత మంచిర్యాలలో మాత్రమే ఉంటుందన్న విషయం ప్రతీ ఒక్కరూ గుర్తుపెట్టుకో వాలన్నారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు కోటేశ్వర్, సురేష్, తహసీల్దార్ దిలీప్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి, ఆరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

'జిల్లాలో రౌడీయిజం పెరిగిపోతోంది'

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రౌడీయిజం పెరిగిపోతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు సంవత్సరాలుగా రౌడీయిజం, మాఫియా సంస్కృతి పెరుగుతుందని, తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం నిరుద్యోగయువతను ముఠాలు తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. సీపీఎం నాయకులు కనికరపు అశోక్, రంజిత్‌కుమార్, మిడిపెల్లి రాజు, రాములు, సమ్మక్క, రేణుక, నాగజ్యోతి, పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన మాజీ కౌన్సిలర్లు

బెల్లంపల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌ను శనివారం మాజీ ము న్సిపల్ కౌన్సిలర్లు కలిశారు. మున్సిపాలిటి అభివృద్ధికి కృషి చేయాలని సమస్యల పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.మాదిగ హక్కుల దండోర నాయకులు కమిషనర్‌ను కలిసి పట్టణ సమస్యలపై వినతిపత్రం అందించారు. మాజీ కౌన్సిలర్లు రాజలింగు, నెల్లి రమేశ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఈసారైనా అనుకూలించేనా..?

(5వ పేజీ తరువాయి)

కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకుండా పోయాయి. అయినప్పటికీ ప్రతిసారీ పంచాయతీ ఎన్నికల సమయంలో నోటిఫికేషన్ విడుదల చేయడం.. నామినేషన్లు దాఖలు కాకపోవడం షరా మామూలైంది.

● ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం..

దశాబ్దాలుగా గూడెం పంచాయతీకి ఎన్నికలు జరగకపోవడంతో గ్రామస్థులు ఎలాంటి పదవులకూ నోచుకోవడం లేదు. రాజకీయాలపై మక్కువ ఉన్నవారు, ప్రజాసేవలో ఉండాలని ఉవ్విళ్లూరుతున్నవారు ఎన్నికల్లో పోటీ చేద్దామన్నా..రిజర్వేషన్ అనుకూలించడం లేదు. గ్రామంలో ఎస్టీ జనాభా లేదని, రిజర్వేషన్‌లో మార్పు చేయాలని గ్రామస్థులు పలుమార్లు ఆందోళనలు కూడా చేశారు. రిజర్వేషన్లు మార్చాలని సామూహిక నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఎప్పటి లాగే ఉంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఎన్నికలు జరు గనుండటంతో రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంది. ఈ మేరకు సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్లపై పూ ర్తి వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోరనుంది. కనీసం ఈ సారైనా రిజర్వేషన్‌లో మార్పులు చేసి, తమ గ్రామ పంచాయతీ తలరాతను మారుస్తారే మోనని, గ్రామస్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని పంచాయ తీలకు చివరిసారిగా 2019లో ఎన్నికలు జరిగాయి. ప్రస్తుత సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం 31 జనవరి 2024తో ముగిసింది. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే 16 నెలలు ఆలస్యం అయింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలతో ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్‌కు అనివార్యం అయింది. త్వరలో రిజర్వేషన్లు ప్రకటించే అవకాశం ఉండటంతో ప్రజా ప్రతినిధులు తమకు అనుకూలించేలా కృషి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అభ్యాస విద్యార్థులకు ప్రావీణ్య పురస్కారాలు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహించిన నేషనల్ సెమ్స్ ఒలం పియాడ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం హైద్రాబాద్ సంజీవయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రావీణ్య పురస్కారాలు అందజేశారు. మంచిర్యాలలోని అభ్యాస పాఠశాలకు చెందిన అక్రిత నందుకు నేషనల్ సెకండ్ ర్యాంక్, రూ. 10 వేల నగదు బహుమతి లభించిందని, అలాగే 45 మంది విద్యార్థులకు వివిధ నేషనల్, స్టేట్, జోనల్ ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సాన సుధతి తెలిపారు. విద్యార్థులు ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వీరికి డిప్యూటి మేయర్ శ్రీలతరెడ్డి, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డిలు పురస్కారాలు అందజేశారని తెలిపారు. విద్యార్థులను కరెస్పాండెంట్ సాన గిరీష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.





పురస్కారాలు అందుకుంటున్న అభ్యాస పాఠశాల విద్యార్థులు

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జన సంఘ్ పార్టీ వ్యవ స్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్థంతిని పురస్కరించుకుని శనివారం బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులోని రోడ్డుకిరువైపులా మొక్కలు నాటారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖర్జీ వర్థంతి సందర్భంగా ఆయన ఆశయాలను నాయకులు, కార్యకర్తలు కొనసాగించాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధు సూదన్‌రావు, మున్నారా జాసినోడియా, రాము, అశోక్‌వర్ధన్, శ్రీనివాస్, ప్రభాకర్‌రా వు, శ్రీనివాస్, భీమన్‌సేన్, నారాయణరెడ్డి, సురేష్, సంపత్‌రావు, హనుమంతరావు, సంపత్‌రావు, రమేష్, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు త్వరగా పూర్తి చేయాలి

భీమిని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : భూభారతిలో వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్‌లో నమోదు చేయడం త్వరగా పూర్తి చేయాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి మూడవ తేదీ నుంచి 18 వరకు నిర్వహించిన గ్రామ సభల్లో ఎన్ని దరఖాస్తులు, ఏ రకంగా వచ్చాయని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిష్కారం కోసం సిద్ధంగా ఉంచిన పలు దరఖాస్తులను ఆయన పరిశీలించారు. మొత్తం 1500 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవోకు తెలిపారు. వీటిలో పీఓటీలు, సాదా బైనామా, సర్వే నంబర్లు మిసింగ్, ఎక్స్టెంట్ మిసింగ్ దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో దృష్టికి తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసి రైతులకు పాస్ పుస్తకాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బికర్ణ దాస్, డీటీ గోవర్ధన్, సీనియర్ అసిస్టెంట్ దాగాం కొండయ్య, ఆర్ఐ వెంకటేష్, జూనియర్ అసిస్టెంట్ చిరంజీవి, తిరుమల ఉన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఈ నెల 30న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో పోస్టులకు సంబంధించిమేళా ఉంటుందన్నారు. వివరాలకు 8247656356, 9110368501లో సంప్రదించాలన్నారు.



ఎమ్మార్పీఎస్ గ్రామ కార్యవర్గం

బెజ్జూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపన్నపేట ఎమ్మార్పీఎస్ గ్రామ కార్యవర్గాన్ని శనివారం మండల ఇన్‌చార్జి శ్రీశైలం మాదిగ, సత్తయ్య మాదిగల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా వైకుంఠం మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కైలాసం మాదిగ, కార్యదర్శిగా లక్ష్మణ్ మాదిగ, కోశాధికారిగా నవీన్ మాదిగ, సభ్యులుగా కార్తీక్ మాదిగ, రమేష్ మాదిగ, రాజేష్ మాదిగ, బాలయ్య మాదిగ, రాజేష్ మాదిగ, శేఖర్ మాదిగ సత్తయ్య మాదిగ, నవీన్ మాదిగ ను ఎన్నుకున్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జూలై 9న తలపెట్టిన సమ్మె నోటీసును శనివారం డీపీవోకు గ్రామ పంచాయతీ కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి అమలు చేయాలని చూస్తున్నారన్నారు. దీన్ని విరమించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపడుతన్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాలొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూ పు బీ, సీ ఉద్యోగాలకు అర్హులైన గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. జూలై 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో మూడు పరీక్షా కేంద్రాలు ఉంటాయని తెలిపారు.



బాలికల విద్యకు భరోసా

- హాస్టల్ వసతి, పౌష్టికాహారం, నాణ్యమైన విద్య
- 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్లంలో బోధన
- సీఈసీ, బైపీసీ, ఎంపీసీతో పాటు వొకేషనల్ కోర్సులు
- జిల్లాలో 15 కస్తూర్బా పాఠశాలలు

గ్రామీణ ప్రాంత నిరుపేద బాలికలు, అనాథ పిల్లల కు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు అండగా నిలుస్తు న్నాయి. విద్యార్థినులకు ఉచిత విద్య, వసతి, భోజనం, కార్పొరేట్ స్థాయిలో స్థాయిలో బోధన అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నాయి.

బెజ్జూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా బాలికా విద్యాలయాలు బాలికల బంగారు భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తున్నాయి. చదువుకోవాలన్న నిరుపేద బాలికలకు వరంగా మారాయి. మంచి ఫలితాలు సాధిస్తున్న ఈ విద్యాలయాల్లో బాలికలకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. మహిళా ఉపాధ్యాయులే పాఠాలు బోధిస్తారు. 6వ తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు విద్యను కొనసాగించే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉన్న ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును కూడా ఇందులో బాలికలకు అందిస్తున్నారు. ఈ విద్యాలయంలో అడ్మిషన్ పొందే బాలికలకు పౌష్టికాహారంతో హాస్టల్ వసతి, నాణ్యమైన విద్య, ఉచిత దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు అందిస్తారు. విద్యతో పాటు ఆత్మ విశ్వాసం పెంపొందించే విధంగా యోగా, కరాటే వంటి వాటిని కూడా ఇందులో శిక్షణ ఇస్తారు. అనాథ పిల్లలు, ఆర్థిక పరిస్థితుల వల్ల మధ్యలో బడి మానేసిన పిల్లలు, చదువుకోవాలనే ఆసక్తి ఉన్న పేద పిల్లలకు కేజీబీవీ ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుంది. బాలికలకు సమగ్ర విద్యను అందిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాలకు మరింత పదును పెటఆల్సలనే లక్ష్యంతో కస్తూర్బా విద్యాలయాలను ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున 13ఏళ్ల కిందట ఈ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. పక్కా భవనాలను సైతం నిర్మించారు. మొదట్లో తెలుగు మీడియంలో ప్రారంభమైన ఈ విద్యాలయాలు క్రమంగా ఇంగ్లీష్ మీడియంగా మార్చి విద్యాబోధన చేస్తున్నారు. ఇప్పుడు 6వ తరగతిలో ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

● పాఠశాలల్లో మెరుగైన బోధన..

కస్తూర్బా పాఠశాలల్లో బాలికలను మెరుగైన బోధన అందిస్తున్నారు. బీఈడీ, ఎంఈడీ చేసిన కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్టీ)లు పోస్ట్ గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(పీజీసీఆర్టీ) విద్యాబోధన చేస్తారు. క్రాఫ్ట్ టీచర్లు కూడా అందుబాటులో ఉండి చేతి నైపుణ్యాలను నేర్పిస్తారు.యోగా, మార్షల్ ఆర్ట్స్, నృత్యాలు, చిత్రలేఖనం వంటి వాటిల్లో కూడా శిక్షణ ఇస్తారు. బాలికలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స చేసేందుకు ప్రతీ కేజీబీవీల్లో ఒక ఏఎన్ఎంను నియమించారు. ప్రతీ రోజుముగ్గురు టీచర్‌లు నైట్ డ్యూటీలో ఉంటారు. విద్యార్థినులకు మెనూప్రకారంపౌష్టికాహారంతో పాటు యూనిఫామ్‌లు, దుప్పట్లు, కాస్మోటిక్ కిట్లు అందిస్తారు.

● జిల్లా వ్యాప్తంగా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 6నుంచి పదో తరగతి వరకు ఒక్కో క్లాస్‌లో 40మంది చొప్పున ఒక్కో పాఠశాలలో 200మంది బాలికలు చదువుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 15పాఠశాలలుండగా, ఇందులో 13పాఠశాలల్లో ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఏటా మే నెల నుంచే 6వ తరగతిలో, మిగిలిన తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో అడ్మిషన్లు తీసుకుంటారు. కస్తూర్బా పాఠశాలల్లో ఇంటర్ అప్‌గ్రేడ్ చేసిన వాటిల్లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కావచ్చిందని అధికారులు తెలుపుతున్నారు.

బాలికలకు బంగారు భవిష్యత్తు

- భాగ్యలక్ష్మి, జీఈసీవో, ఆసిఫాబాద్



చదవాలనే ఆసక్తి ఉన్న బాలికలకు కేజీబీవీలు బంగారు భవిష్యత్తును ఇస్తాయి. అనాథ పిల్లలకు, బడి మానేసిన, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు చదువుకు దూరం కాకుండా వారిని చేరదీసి ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కేజీబీవీలను ఏర్పాటు చేశారు. ఇందులో నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్య రక్షణ, పౌష్టికాహారం ప్రభుత్వం ఇందిస్తుంది. ఇటీవల మెనూ కొత్తగా మార్చి రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నాం. గుడ్లు, నెలకు రెండుసార్లు మటన్ లేదా చికెన్ విద్యార్థినులకు అందిస్తున్నాం.

కాగజ్‌నగర్‌లో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. నిజాముద్దీన్‌కాలనీలో ఉదయం నుంచి ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ రామానుజం మాట్లాడారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు వివరాలను ఎవరికి తెలుపకూడ దని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు ప్రేంసాగర్, శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న మాజీ ప్రజాప్రతినిధులు

చింతలమానేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి నుంచి గూడెం వరకు ఉన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేటప్టాలని మండల మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో కొందరు నాయకులు రోడ్డుకు మరమ్మతుల పేరిట లక్షలు వెచ్చించి చదును చూస్తే చిన్నపాటి వర్షానికి పూర్తిగా బురదమయగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రజాప్రతినిదులుగా ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇతర నాయకులు అధికారులు స్పందించక పోతే వారం రోజుల తరువాత మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహాయంతో తామే ఈ రోడ్డుకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తూ వస్తుంటాయని చెప్పారు. పూర్తిగా బురద మయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకన్న, నాజీం హుస్సేన్, రాజన్న, జె రాజన్న, నారాయణ, నీలాగౌడ్, శ్రీను, ఫణిందర్, శంకర్, సాగర్, విఘ్నేష్, దేవాజీ, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ రమాదేవి

కెరమెరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని పాటించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి అన్నారు. మండలంలోని హట్టిన ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. మెనూ పాటించకుంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. వర్షాకాలంలో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వంట గది, స్టోర్ రూంలను పరిశీలిం చారు. ఆమె వెంట జీసీడీవో శకుంతల, వార్డెన్ పంచపుల తదితరులు ఉన్నారు.

రైతులను పలకరించి.. విత్తనాలు పెట్టి..

పెంచికలపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెపల్లి గ్రామ శివారులో పొలం పనుల్లో ఉన్న రైతులను ఎమ్మెల్యే హరీష్‌బాబు శనివారం పలుకరించి మహిళలతో కలిసి పత్తి విత్తనాలు పెట్టారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు. శనివారం మండలంలో పర్యటించారు. తిరిగి వెళ్తున్న క్రమంలో గుండెపల్లి గ్రామ శివారులో మహిళా రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. వెంటనే ఆయన కూడా మహిళా రైతులతో కలిసి విత్తనాలు విత్తారు. సాగు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు సకాలంలో అందతున్నాయా, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలని ఎమ్మెల్యే చెప్పారు. అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలపడాలని సూచించారు.



పత్తి విత్తనాలు పెడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

మొహర్రం వేడుకలు ప్రారంభం

రెబ్బెన, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం పుంజుమేరగూడలో మోహర్రం వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జూలై 3న చిన్న సరిగెత్తు, జూలై 5న పెద్దసరిగెత్తు నిర్వహించనున్నామని గ్రామస్తులు తెలిపారు.

గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాల్‌రావు

సిర్పూర్(టి), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మహిళా సంఘాలకు అడల్ట్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సభ్యులు చదువు రాని వారిని ఎంపిక చేయాలన్నారు. అనంతరం ఎంఈవో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్పీలు ఏపీఎం దుర్గయ్య, సీఆర్పీలు పవన్‌కుమార్ తదితరులున్నారు.

ఎరువులు అందేలా చూడాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ బాపు

సిర్పూర్(టి), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులు ప్రతీ రైతుకు అందేలా కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ బాపు అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగ్రో, సహకార సంఘం ద్వారా ప్రతి రైతుకు ఎరువులు అందేలా కృషి చేయాలన్నారు. డైరెక్టర్‌లు రాజు, అశోక్‌లు మాట్లాడుతూ ఎరువులు ప్రభుత్వ మద్దతు ధరకే విక్రయించేలా అధికారులు చూడాలన్నారు. ఏవో గిరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతుకు నిబంధన ప్రకారం ఎరువులు అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్, సీఈఓ రాకేష్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వస తుల కల్పనకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్‌ఖానం అన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అంకుశాపూర్‌లో గల ప్రభుత్వ వైద్య కళాశాలను శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో కలిసి సందర్శిం చారు. కళాశాలోని గదులు, తరగతి గదుల పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌక ర్యాలు, విద్యాబోధన వివరాల ను తెలుసుకున్నారు. అనం తరం కళాశాల ప్రిన్సిపాల్, అధికారులతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. త్వరలో వైద్య కళాశాలలో బోధనకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒప్పంద పద్ధతిలో ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, వైద్య కళాశాల భవన పనులు దాదాపుగా పూర్తి కావస్తు న్నాయని చెప్పారు. విద్యార్థులకు త్వరలో వసతి గృహాల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాల భవనం పూర్తి చేసి ఒకే ప్రాంతంలో ఉండే విధంగా వైద్య విద్యార్థులకు వసతి గృహాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుం టామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి డయాలసిస్ కేంద్రం, ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ గదులను పరిశీలించి అయేషా మస్రత్‌ఖానం అధికారులకు సూచనలు చేశారు. ఆసుపత్రికి వైద్య కోసం వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఆసుపత్రి పర్యవేక్షకు లు, వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య కళాశాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ అయేషా మస్రత్‌ఖానం, పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

రేపు మినీ జాబ్‌మేళా

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీఐ మహిళా కేరీర్ ఏజెంట్(బీమా సఖి) 100, ఎంఎస్‌సీ బ్యాంక్ కంపెనీ రిలేషన్ షిప్ మేనేజర్ 60 పోస్టుల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నామని తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమ్మె విజయవంతం చేయాలి

వాంకిడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జూలై 9ననిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం హమాలి వర్కర్స్‌యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సునీల్, ధర్మేందర్, సుధాకర్, లాలు, దవలత్, దిలీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

బెజ్జూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని శనివారం బాధితురాలి బంధువులు, బీఆర్ఎస్ నాయకులు శనివారం మర్తిడి గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువు రు నాయకులు మాట్లాడుతూ బెజ్జూరు మండలం మర్తిడి గ్రామానికి చెందిన కుమ్మరి స్వప్న అనే డిగ్రీ విద్యార్థిని రెండు రోజుల క్రితం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ గురకుల డిగ్రీ కళాశాల భవనం పై నుంచి కింద పడి చికిత్స పొందుతూ మృతి చెందిందని చెప్పారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతికి కారకు లైన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాం డ్ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామా నుజం ఆధ్వర్యంలో కౌటాల సీఐ రమేష్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్సై ప్రవీణ్‌కుమార్, విక్రమ్, విజయ్, నరేష్, కమలాకర్, కొముర య్యలు గ్రామంలో భారీ బందోబస్తు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఆందోళనకారులతో పోలీ సులు విద్యార్థిని మృతిపై న్యాయం చేస్తామని చెప్పినప్పటికీ అంత్యక్రియలు చేయడానికి ససేమీరా ముం దుకు రాలేదు. అధికారులు వచ్చి తమకు న్యాయం చేసే వరకు అంత్యక్రియలు జరప బోమని చెప్పారు. జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్‌లు వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రామ్మోహన్ బాధిత కుటుంబ సభ్యులతో మా ట్లాడారు. తమ కూతురు మరణానికి కారకు లైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అధికారులకు చెప్పగా నాయకుడు హర్షద్ హుస్సేన్ ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. తహసీల్దార్ కుటుం బంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించేందుకు ఉన్నతాధికారులకు నివేది స్తామని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన విరమించా రు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

సీతక్కకే బాధ్యతలు అప్పగించాలి

జైనూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన చట్టాలపై అవగాహన ఉన్న మంత్రి సీతక్కకే గిరిజన సంక్షేమ శాఖ మంత్రుత్వశాఖ బాధ్యతలు అప్పగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయిసెటర్ జిల్లా సర్‌మెడి జుగునాక దేవరావ్ మాట్లాడారు. తెలంగాణ వచ్చాక గత పదేళ్లలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు గిరిజనుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆదివాసీల జీవన విధానంపై ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తులకు అప్పటి ప్రభుత్వం గిరిజన మంత్రి పదవి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మహగాం జిల్లా సార్‌మెడి ఆత్రం ఆనంద్‌రావ్, ఆదివాసీ నాయకులు కనక గంగారాం, ఆత్రం పితాంబర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తొలగింపు

కెరమెరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదతో సాంగ్వీ-కేలి(బి) గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ వంతెనపై పేరుకు పోయిన మట్టిని ఎక్స్‌కావేటర్‌తో శనివారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అంజద్ పాషా మాట్లాడుతూ వంతెన అవతలి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మట్టిని తొలగించామని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శులు ఈశ్వర్, సరిత ఉన్నారు.



మట్టిని తొలగిస్తున్న అధికారులు